# కన్యాశుల్కం-రాజ్యం-రాజ్యాంగయంత్రం

**బ్రిటిష్** వాళ్ల కోర్టులు వాళ్ల దేశంలో ఎట్లా పని చేస్తాయోగానీ ఇక్కడ మట్టుకు వాటిని నెలకొల్పిన నాటి నుండి ఈనాటిదాకా ఒకేరకంగా భ్రష్టుపట్టి ఉన్నాయి. ఒక్క కోర్టు సంగతే ఎందుకు, రాజ్యాంగ యంత్రమంతా అంతే. రాశిలో నానాటికీ పతనం లేకపోలేదు గానీ గుణం మట్టుకు ఆనాడూ ఈనాడూ ఒక్కటే. 'మా చట్టాలు మంచివేగానీ మీ రామప్పపంతుళ్ళ నియోగపు తెలివితేటలు వాటిని భ్రష్టుపట్టించా'యని తెల్లవాళ్లంటారేమో. కాని నిష్పాక్షికంగా మాట్లాడుకుంటే ఆ చట్టాలకూ ఈ కరణీకపు తెలివితేటలకూ సరిగ్గా అతికింది. దాని కోసం ఇదీ, దీని కోసం అదీ అన్నట్లు సరిపోయాయి రెండూ. అగ్నిహోత్రావధాన్లుకు మెకాలే గురించి తెలీదు గానీ తెలిసి వుంటే 'అతగాడు కూడ కరణమేనష' అని వుండేవాడేమో. (మ్లేచ్ఛ కరణమయితేనేం!) బూర్జువా ప్రజాతంత్ర సాంప్రదాయం నుండి పుట్టిన సంస్థలు ఫ్యూడల్ ప్రభువుల వ్యవహార రీతులకు ఇంత బాగా అతికాయంటే ఆ 'ప్రజాతంత్ర సంప్రదాయం వలసలో తీసుకున్న రూపం అటువంటిది.' భూస్వామ్య పెత్తనాన్ని ఎంతమాత్రం ఇబ్బంది పెట్టకుండా, రాజకీయ స్వేచ్ఛ కల్పించకుండ 'నిష్పాక్షికమయిన నియంతృత్వాన్ని' (ఇంపార్షియల్ డెస్పాటిజం అనేది మెకాలే ప్రయోగించిన మాట) ఈ భూస్వామ్య సమాజం మీద నెలకొల్పాలన్న బ్రిటిష్ సంకల్పం ఈ స్థితికి దారి తీసింది.

న్యాయవ్యవస్థ ఈ మధ్యనే మరీ పాడయిపోయిందనీ, ఒకప్పుడు ముఖ్యంగా తెల్లవాళ్ళ పాలనలో – చాలా బాగుండిందనీ మనల్ని నమ్మించడానికి పెద్దలు ప్రయత్నం చేస్తుంటారు. నానాటికీ పాతాళానికి చేరువ అవుతున్న ఈ అధోగమనాన్ని కాదనాల్సిన అవసరం లేదుగానీ ఈ చెట్టుకు చీడ విత్తనం నాడే పట్టిందని గుర్తించకపోతే మాత్రం చరిత్ర గమనాన్ని మనం తప్పుగా అర్థం చేసుకున్న వాళ్లమవుతాం. "పెద్ద పెద్ద వకీళ్లు కూడా సిగ్గుమాలి బరిపెట్టి దొంగసాక్ష్యాలు

---

1992లో రాసిన వ్యాసం. అచ్చయింది మాత్రం 1997లో. పుస్తకం పేరు నూరేళ్ళ కన్యాశుల్కం. కన్యాశుల్కం రచనకు నూరేళ్ళు నిండిన సందర్భంగా వెలుగు ప్రచురణగా వచ్చింది.

పాఠం చెబుతారు. కొందరు మృదవరులు తిరగేసి కొట్టమంటారు. నా వంటి చాదస్తులం ఇంకొక కొందరం అట్టి పాపానికి ఒడిగట్టుకోం గాని, మా పార్టీల తరపు సాక్షులు కూడా అబద్ధం చెబుతున్నారని యెరిగిన్నీ ఊరుకుంటాం" ...... "నిజమయిన సాక్ష్యం! ఏం సత్యకాలం! నిజమాడేవాడు సాక్ష్యానికి రాడు, సాక్ష్యానికొచ్చేవాడు నిజమాడలేడు..." "వాదిని బాధించే నిజం వాది తరపు వకీలుకి అక్కరలేదు. ప్రతివాదిని బాధించే నిజం ప్రతివాది వకీలుకీ అక్కరలేదు. క్రాసెగ్జామినేషన్ ఆరంభించేసరికి ఎంతటి సాక్షీ కవిత్వం ఆరంభిస్తాడు..." "వకీళ్లు అబద్ధాలాడిస్తే న్యాయం కనుక్కోవడానికి జీతం పుచ్చుకునే జడ్జి ఏం జేస్తాడండి?" అని అడిగితే "ఉభయ పార్టీల వకీళ్లు ఆడించే అబద్ధాలు చేయి పీకేటట్టు రాసుకుంటాడు." ఈ మాటలు ఇవ్వాళ కొత్తగా వృత్తిలోకి దిగి ఆదర్శాలు ఇంకా చెడని యువ న్యాయవాది అంటున్నవి కావు. 100 ఏళ్ల క్రితం సౌజన్యారావు పంతులనే సత్యసంధుడయిన వకీలు చేత గురజాడ చెప్పించినవి. ఇవ్వాళ అదనంగా ఏమనగలం? జడ్జిగారు ఇరు పార్టీ అబద్ధాలను చేయి పీకేటట్టు రాసుకోవడమే కాక 'ఆ రెండు అబద్ధాలలో దేనిని తాను సత్యంగా గుర్తించదలచుకుంటాడో నిర్ణయించుకోవడానికి చేయి తడుపుకుంటాడు' కూడా అని ఈనాటి వకీళ్లు అంటారేమో. ఆనాడు మట్టుకు ఇది లేదనా?

మధురవాణి కంటె మధురవాణి దగ్గరే ఉండగా రామప్ప పంతుల్ని వదిలించుకోవడం కోసం ఆమె 'నా కంటె ఏదీ' అని అతడిని వేధిస్తుంది. రామప్ప పంతులు భయపడి హెడ్ కానిస్టేబుల్‌ను పట్టుకొని లుబ్ధావధాన్లు మీద హత్య కేసు పెడతానని బెదిరించి కంటే ఇప్పించమంటాడు. హెడ్‌కానిస్టేబులు హత్యకేసు పెట్టడుగాని లుబ్ధావధాన్లను బెదిరించి తాను లంచం పుచ్చుకుంటాడు. హెడ్ కానిస్టేబుల్‌తో పని అయ్యేటట్లు లేదని రామప్ప పంతులు ఇన్‌స్పెక్టరును, సూపర్నెంటునూ పట్టుకుని హత్య కేసు పెట్టిస్తాడు. హెడ్ కానిస్టేబుల్ మీద ఫిర్యాదు కూడా చేస్తాడు. ఇప్పుడు లుబ్ధావధాన్లను కాపాడే బాధ్యత హెడ్‌కానిస్టేబుల్ మీద పడుతుంది. నిజానికి లుబ్ధావధాన్లు నిర్దోషే. అసలు ఆ హత్యే అబద్ధం. హత్య దాకా ఎందుకు, హత్య చేయబడ్డ నవ వధువే అబద్ధం. కరటకశాస్త్రులూ, మధురవాణీ సిద్ధాంతి సాయంతో, మీనాక్షి సాయంతో కల్పించిన అబద్ధం. అయినా

లుబ్ధావధాన్లు నిర్దోషిత్వాన్ని రుజువు చేయడానికి దొంగ సాక్ష్యాలు కావాలి. (ఈనాటికీ కోర్టులలో అబద్ధాలే కాదు, నిజాలు కూడా దొంగ సాక్ష్యాలతో ఋజువు చేస్తారు.) కాని హెడ్ కానిస్టేబుల్ పెట్టించిన దొంగ సాక్ష్యాలను ఇన్స్పెక్టర్ బెదిరించి చెడగొడతాడు. ఇద్దరిలో ఇన్స్పెక్టరే బలవంతుడు కాబట్టి సాక్షులు అతని నిజమే చెప్పదలచుకుంటారు. 'పోలిశెట్టీ సాక్ష్యం చెప్పాలి' అని హెడ్ కానిస్టేబుల్ అంటే పోలిశెట్టి 'సిత్తంబాబు' అనాలి. 'పోలిశెట్టీ, కబడదార్, సాచ్చీకం చెప్తే చంపేస్తా'నని ఇన్స్పెక్టరంటేనూ 'సిత్తం బాబు' అనాలి. ఎందుకంటే ఇన్స్పెక్టర్ హెడ్ కానిస్టేబుల్ను బదిలీ చేయించగలడు కాబట్టి. ఇక సాక్ష్యం ఎవడు చెప్పాలంటారా, 'కోమటి సాక్ష్యం ఎందుకు, బాపనోళ్లు కొంచెం సెయి తడిపీస్తే సాచ్చీకం చెప్పేసిపోతారు.'

మరి కేసు విచారించే డిప్టీ కలెక్టరు? ఆ స్థాయికి చెందిన అధికార్ల సంగతి ఆనాడూ ఈనాడూ ఒకటే. వాళ్ల నీతిని గురించీ నడవడికను గురించీ జనం ఎప్పుడూ 'అట' అనే అనుకుంటారు తప్ప నిజం అప్పుడే తెలీదు. చిన్నవాళ్ల దొంగ వ్యవహారాలే తేటతెల్లంగా తెలిసిపోతాయి. డిప్టీ కలెక్టరు లంచానికి లోబడతాడని రామప్పపంతులు ఉవాచ. అది కానిపని అని సౌజన్యారావు పంతులు అభిప్రాయం. పైగా 'నా స్నేహితుడు' అని తన సౌజన్యాన్ని అతగాడికి కూడ ఆపాదిస్తాడు. డబ్బు కక్కుర్తి లేదుగానీ 'స్త్రీ వ్యసనం కద్దు' అని కరటకశాస్త్రులు అభిప్రాయం. అందుకే మధురవాణిని అతని దగ్గరకి పంపించి లుబ్ధావధాన్లుని కాపాడదామని ప్రయత్నిస్తాడు. (మధురవాణి సీమకుక్క – ఊరకుక్క అంటూ చర్చ పెట్టి పాడు చేస్తుంది). ఇవ్వాళ ఈ రకమయిన చర్చ ఏ జడ్జి గురించి, ఏ అధికారి గురించి జరగడం లేదు?

భారతదేశ చరిత్రలో రాజ్యం (స్టేట్) స్వభావంలో మౌర్యుల కాలం నుండి జవహర్ లాల్ నెహ్రూ కాలం దాకా – ఒక అవిచ్ఛిన్నత ఉంది. అవిచ్ఛిన్నత ఉందంటే తేడాలు లేనేలేవని కాదు, మార్పులు అసలే లేవని కాదు. మార్పు విధ్వంసక రూపంలో రాలేదు. కొత్త అధికారం పాత అధికారాన్ని తనలో ఇముడ్చుకుంది. పాత పెత్తనానికి కొత్త వ్యవస్థలో చోటు కల్పించింది. భారతదేశ చరిత్రలో ఏ విప్లవమూ ఈనాటి దాకా సంపూర్ణంగా రాలేదు. బ్రిటిష్ వలస

పాలనతో వచ్చిన 'ఆధునికత' దీనికి మినహాయింపు కాదు. పాత విప్లవాలు అసంపూర్ణంగా ఉండిపోవడానికి గల కారణమేమిటనేది ఇప్పటికీ చరిత్రకారులలో చర్చనీయాంశమే, కాని బ్రిటిష్ వలస పాలనతో వచ్చిన ఆధునికత విషయంలో వివాదానికి పెద్దగా ఆస్కారం లేదు. అది నిష్కళంకమయిన ఆధునికత కాదు. ఫ్యూడల్ వ్యవస్థతో రాజీపడిన ఆధునికత. వలస పాలనావసరాలు రెంటికీ రాజీ కుదిర్చాయి.

బ్రిటిష్ వాళ్ల కోర్టులు భారత న్యాయవ్యవస్థలో పైకి చూడడానికి సరికొత్త మార్పు. వాటికి మూలమయిన బూర్జువా చట్టం మను ధర్మశాస్త్రం కంటే చాలా భిన్నమయినది. అది ప్రపంచ చరిత్రలోని ప్రప్రథమ ప్రజాస్వామ్య విప్లవం నుండి పుట్టింది. మను ధర్మశాస్త్రంలో ప్రజాస్వామ్యం లేశమంతయినా లేదు. అయినా ఏ మాత్రం ఇబ్బంది లేకుండా ఈ దేశంలోని భూస్వామ్య పెత్తందారీ వర్గాలు ఆ చట్టంతో ఆ న్యాయవ్యవస్థతో సర్దుకు పోగలిగారు. తమ పెత్తనాన్ని కొనసాగించడానికి నిరభ్యంతరంగా వాడుకున్నారు. ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పే ఉద్దేశ్యం ఎంతమాత్రం లేకుండా వలస పాలకులు ప్రజాతంత్ర రూపం ఉన్న సంస్థలను మీది నుండి నెలకొల్పేసరికి అవి భూస్వామ్యపు ఊడలు వేసాయి. అగ్నిహోత్రావధాన్లు లాంటి కోర్టు పక్షులకు, రామప్పపంతులు లాంటి – వాళ్లకూ వీళ్లకూ జుట్లు ముడేసి జీవనం చేసే జిత్తులమారికి ఈ కోర్టుల వ్యవహారం కొట్టిన పిండి అయింది. ఇంగ్లీష్ ముక్కలు రాకపోవడం ఇబ్బందే. అయితే నాలుగు బొట్లేరు ముక్కలు నేర్చిన గిరీశాలు ఎంతమంది లేరు! గ్రామంలో పెత్తందార్లుగా ప్రజల జీవితాలను శాసించినవారు కొత్త రాజ్యంలో కోర్టు పక్షులయ్యారు. వకీళ్ళకు బ్రోకర్లయ్యారు. చెట్టుకింద ప్లీడర్లయ్యారు. వకీళ్ళే అయ్యారు. వీడి భూమి వాడికీ, వాడి భూమి వీడికీ రాసిన కరణాలూ, కర్రపెత్తనంతో గ్రామ జీవితాన్ని శాసించిన పెద్దలూ కొత్త రాజ్యంలో 'లిటిగేషన్'ను ఆయుధంగా పదునుపెట్టారు. రామప్ప పంతులు తన్ను గూర్చి తాను చెప్పుకున్నట్టు ఈ తాలూకాలో సివిల్ మేజిస్ట్రేటు ఎవరొచ్చినా రామప్పపంతులు పప్పులేని పులగం లేదు. కోర్టు వ్యాజ్యాలకూ, తాంబూలం ఇచ్చేసాను ఇక తన్నుక చావండి అనే సంస్కృతికీ చక్కగా అతికింది. అందుకే గిరీశం వేషభాషలు చూసి 'తురక' అని ఈసడించుకున్న

అగ్నిహోత్రావధాన్లుకు అతను కోర్టు కాగితాలు ఇంగ్లీష్ నుండి తెలుగులోకి తర్జుమా చేయగలడని తెలియగానే (లేదా భ్రమించగానే - గిరీశంకు నిజంగా ఇంగ్లీష్ ఏ పాటి వచ్చునో మనకు నాటకం చివరిదాకా కూడా అనుభవమే) అతని మీద కోపం పటాపంచలయి పోతుంది. ఎక్కడలేని వాత్సల్యం పుట్టుకొస్తుంది.

గిరీశం ఇంగ్లీష్ జ్ఞానం గురించి మాట్లాడుకునేటప్పుడు ఒక విషయం గమనించాలి. బ్రిటిష్‌వాళ్లు మన దేశంలో నెలకొల్పిన రాజ్యంలో ఇంగ్లీషుకు విలక్షణమయిన స్థానం ఉంది. అది కేవలం పాలకుల భాష మట్టుకే కాదు. అది అధికారానికి సంకేతం - జంధ్యం బ్రాహ్మణ్యానికి సంకేతమయినట్టు. భాష అధికారానికి సంకేతమయితే భాషగా దాని లక్షణాలను పోగొట్టుకుంటుంది. ఇప్పుడింక వాక్య నిర్మాణం, వ్యాకరణం, భావం అక్కరలేదు. ఇంగ్లీషు మాట్లాడమంటే 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' ఒప్పజెప్పడం మట్టుకే వచ్చినా చాలు అది ఇంగ్లీషే. ఈ రహస్యాన్ని కనిపెట్టిన ఘనుడు గిరీశం. అందరి మీదా అతని ఆధిక్యానికి మూలం ఈ ఎరుకే. చివరికి ఏ భ్రమలూ లేని మధురవాణిని కూడా భ్రమింపజేయగలిగాడంటే అది ఇంగ్లీషు ముక్కల మహిమే. కొన్ని తరాల క్రింద పర్షియన్ అరబ్బీ భాషలకు మన దేశంలో ఇదే స్థానం ఉండింది. అప్పుడు బ్రాహ్మణులు ఆ భాషలు నేర్చుకొని రాజ్యాధికార వ్యాఖ్యాతలుగా తమకు సంప్రదాయకంగా ఉండిన స్థానాన్ని కాపాడుకోగలిగారు. 19వ శతాబ్దం వచ్చేసరికి అదే కారణంగా ఇంగ్లీషు ఒంటబట్టించుకున్నారు. దీనితో నాశనమయిపోతూ ఉందని రుసరుసలాడిన చాదస్తుడు అగ్నిహోత్రావధాన్లు లాంటివాడు సహితం గిరీశం ఇంగ్లీష్ ముక్కల మాయలో పడక తప్పలేదు. ఇంక చిన్న తరం సంగతి చెప్పేదేముంది? దరిద్రపు సంస్కృతం వదిలిపెట్టి ఇంగ్లీష్ నేర్చుకొని నూతన రాజ్యాంగ యంత్రంలో ఏదో ఒక అంతస్తులో కలిసిపోదామన్న ఆకాంక్షతోనే కదా కరటకశాస్త్రులు శిష్యుడు గురువుగారు ఇంగ్లీష్ నేర్పుతానని హామీ ఇవ్వగానే అందుకు ప్రతిఫలంగా అమ్మాయి వేషం వేసి లుబ్ధావధాన్లుతో వివాహం నాటకం ఆడడానికి ఒప్పుకుంటాడు! ఆ ఆశ లేకపోతే కన్యాశుల్కమే లేదు.

సమాజంలో నీతికీ నడవడికకూ ప్రమాణాలను నిర్దేశించే విధాయకులుంటారు. వాళ్లపట్ల విధేయత మన ధర్మం. విధేయులం కాకపోతే మనల్ని

శిక్షిస్తారు. దేవుడు, రాజ్యం ప్రధానమయిన విధాయకులు. ఇంటింటా ఊరూరా ఉన్న సెకండ్‌గ్రేడ్ లేక చిల్లర విధాయకులు దేవుడి పేరిటా, రాజ్యం పేరిటా, ధర్మం పేరిటా, శాసనాల పేరిటా తమ పెత్తనాన్ని సమర్థించుకుంటారు. శాసనాల భారాన్ని, ధర్మాన్ని నిలబెట్టే బాధ్యతనూ మోస్తున్నామంటూ మనల్ని పరి పాలిస్తుంటారు. అయితే ధర్మానికీ, శాసనాలకూ కర్తలయిన దేవుడినీ రాజ్యాన్నీ శాసించే వారెవరూ లేనట్టే వాటి పేరు మీద మనల్ని పరిపాలించే వారిని కూడ శాసించేవారు లేరు. హవల్దారు మునసబుతో అన్నట్టు 'గవర్నమెంటు, దేవుళ్లు, బ్రాహ్మలు - వారి నేరాలు వారివి, వాటితో మనకు పనిలేదు. మన భక్తి మనకుండాల'. ఈ విధాయకుల నుండి మానవ జాతికి విముక్తి లభించిననాడే చరిత్ర చరమదశ చేరుకున్నట్టు. అప్పటిదాకా వచ్చిన అన్ని విప్లవాలూ అసంపూర్ణమయినవే. బండివాడికి నేషనల్ కాంగ్రెస్ గురించి 'రెండు గంటలు' లెక్చర్ ఇవ్వగా అంతా విని ఆ 'గాడిద కొడుకు' మా వూరి హెడ్‌కానిస్టేబుల్‌ని కాంగ్రెస్‌వారు ఎప్పుడు బదిలీ చేస్తారని అడిగాడని ఉటంకించి 'పల్లెటూరి పీపుల్ లెక్చర్లకి అన్‌ఫిట్' అని గిరీశం నిర్ధారించాడు గానీ బండివాడి ఆకాంక్షను సరిగ్గా అర్థం చేసుకొని ఒక్క హెడ్‌కానిస్టేబుల్‌కే కాక సకల పెత్తందారీ వర్గాలకూ వర్తింపజేసుకుంటే ప్రజాతంత్ర ఉద్యమం అజెండా మనకు అవగతం అవుతుంది. కొత్తగా వచ్చిన విక్టోరియా రాణి గవర్నమెంటు కనీసం పాత దేవుళ్ళనూ బ్రాహ్మణ్యాన్నీ దెబ్బకొట్టి వుంటే మిగిలిన పని ప్రజలు చేసుకొని ఉందురేమో. కాని అది పాత దేవుళ్ల సరసన తానూ ఒక దేవతయి కూర్చుంది. యూరప్‌లో రాచరికాల్ని అంతం చేసి చర్చి అధికారానికి తోక కత్తిరించి బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని నెలకొల్పిన ప్రజాస్వామ్యం ఇక్కడ నియంతృత్వమయ భూస్వామ్యంతో, రాచరికంతో, బ్రాహ్మణ్యంతో శాంతియుత సహజీవనం చేసింది.

ఆ శాంతియుత సహజీవనంలో చిన్న చిన్న వైరుధ్యాలు లేకపోలేదు. రామప్పపంతులంతటి వాడిని కొత్తగా పుట్టుకొచ్చిన హెడ్ కానిస్టేబుల్ మూడు చెరువుల నీళ్లు తాగిస్తాడు. వద్దన్న కొద్దీ మధురవాణి వింటుండగా చిలిపిగా ఏకవచన ప్రయోగం చేసి పంతులు పరువు తీస్తాడు. 'లుబ్ధావధాన్లు పెళ్లాడిన గుంట మధురవాణి తాలూకు కంటె తీసుకొని పారిపోయింద'ని రామప్పపంతులు

ఆదుర్దాగా ఫిర్యాదు చేస్తే ఆ 'గుంట' అసలు గుంట కాదనీ, ఆ పెళ్లి అసలు పెళ్లి కాదనీ తెలిసీ పంతులుకు చెప్పకుండ తాపీగా చర్చ మొదలుపెడతాడు. కంటె దక్కించుకోవడం కోసం లుబ్ధావధాన్లు మీద ఖూనీ కేసు పెట్టించడానికి రామప్పపంతులు చాలా కష్టపడవలసి వస్తుంది. కలికాలం కాకపోతే బ్రాహ్మడు పోలీసోడ్ని ఇంతగా అడుక్కోవడమా? 'డబ్బు పేల్తుంద'ని ఆశ పెడతాడు. 'పోలీసు డ్యూటీ బెదిరించడమే కదా' అని నిష్టూరం ఆడతాడు. హెడ్ కానిస్టేబుల్ సత్యసంధుడు కాదుగానీ హత్య నిజంగా జరగలేదని తెలిసినవాడు కాబట్టి కేసు పెట్టడు. లుబ్ధావధాన్లును బెదిరించి తాను 'నాలుగు రాళ్లు తడుపుకొని' ఊరుకుంటాడు. కేసు పెట్టించడానికి రామప్పపంతులు ఇన్స్‌పెక్టర్‌నూ సూపర్నెంటునూ పట్టుకోవలసి వస్తుంది.

ఇంగ్లీష్‌లో 'లా అండ్ ఆర్డర్' అనే దానిని తెలుగులో 'శాంతి భద్రతలు' అనడం అలవర్చుకున్నాం. 'లా' సంగతి అట్లాగుంచి 'ఆర్డర్' అనే మాట కేవలం సామాజిక శాంతినీ భద్రతనూ సూచించదు. వ్యవస్థాగతమయిన భద్రతను సూచిస్తుంది. అంటే దొమ్మీలూ, దొంగతనాలూ మట్టుకే కాదు. వ్యవస్థ నిర్మాణాన్ని కదిలించేది ఏదయినా అభద్రతే. వ్యవస్థ నిర్మాణాన్ని చెక్కు చెదరకుండా కాపాడడం రాజ్యం ప్రధాన కర్తవ్యం. చట్టాలూ, కోర్టులూ, పోలీసులూ ఉండేది అందుకోసమే. సామాజిక వ్యవస్థపైన జరిగే తిరుగుబాటును నేరచట్టం పరిధిలోకి తీసుకొచ్చి పీనల్‌కోడ్ కింద విచారించి శిక్షిస్తుంది ఆధునిక బూర్జువా రాజ్యం. మతాచారాలకూ ధర్మశాస్త్రాలకూ మధ్యయుగాలలో వ్యవస్థాగతమయిన భద్రతను నిలబెట్టడంలో ఉండిన పాత్రను లౌకికత పేరిట తిరస్కరించిన బూర్జువా రాజ్యం ఆ పాత్రను నేర చట్టానికి అప్పగించింది. గిరీశం బుచ్చమ్మను 'లేవదీసుకుపోవడం' ఒకప్పుడు ధర్మ విరుద్ధమయి ఉండేది. ధర్మాన్ని అతిక్రమించినందుకు గిరీశం శిక్షార్హుడయి ఉండేవాడు. బ్రిటిష్ పాలనలో ఆ'ధర్మం' తన శాసనాధికారాన్ని కోల్పోయింది. అయితే సామాజిక వ్యవస్థలో తన పాత్రనది కోల్పోలేదు. మొదట్లో బ్రాహ్మణ్యాన్ని కనీసంగా సంస్కరించడానికి పూనుకొన్న బ్రిటిష్ పాలకులు పోను పోను ఆ సంస్కరణ బాధ్యతను వైయక్తిక చొరవకు వదిలిపెట్టి బ్రాహ్మణ్యంతో సమైక్య సహజీవనం చేయసాగారు. గిరీశం (అతని నిజాయితీ సంగతి పక్కకు పెడితే)

బ్రాహ్మణ్యం మీద చేసిన తిరుగుబాటు డిప్టీ కలెక్టర్ కోర్టులో 'అబ్డక్షన్' కేసయింది. పీనల్ కోడ్‌కింద నేరమయింది. ఆ డిప్టీ కలెక్టరు బ్రాహ్మణ్యాన్ని ద్వేషించే వ్యక్తి అయినప్పటికీ, ఫిర్యాదులో గిరీశం తండ్రి పేరు, ఊరి పేరు సక్రమంగా లేవన్న సాంకేతిక కారణం వల్ల మాత్రమే దానికి అభ్యంతరం చెప్పగలడు. అన్నీ సక్రమంగా ఉండి వుంటే, సాక్ష్యాలు ఉండి ఉంటే అంతటి బ్రాహ్మణద్వేషీ గిరీశానికి శిక్ష వేయవలసిందే. బ్రిటిష్ వలస రాజ్యం బ్రాహ్మణ్యంతో అంతగా రాజీపడింది. ఒక్క బ్రాహ్మణ్యంతోనే కాదు, సకల భూస్వామ్య సంబంధాలతోనూ అంతగా రాజీ పడింది. ఆ రాజీ నుండి పుట్టిన ఈ రాజ్యం ఈనాటికీ మనల్ని ఏలుతుంది. ఇంక మిల్ దొరగారూ, మెకాలే దొరగారూ, నెహ్రూ దొరగారూ ఎన్ని లెక్చర్లిచ్చినా అది ప్రజాస్వామికంగా ఎట్లా ఉండగలదు?

ఈ వికృత సృష్టి పోను పోను చాలా రాక్షసరూపం తీసుకుంది. దానిని చూసి హేళనగా నవ్వుకునే కాలం గడిచిపోయింది. గురజాడ సృష్టించిన హెడ్ కానిస్టేబుల్ జిత్తులు చూసి కనీసం నవ్వుకోగలం. కోర్టు భ్రష్టత్వాన్ని గురించి సౌజన్యారావు పంతులు లెక్చర్ ఇస్తుంటే అమాయకపు ఫోజు పెట్టి సంభ్రమాశ్చర్యాలతో తిలకించే గిరీశం నటన చూసి కూడా నవ్వుకోగలం. అందరికీ భయపడే పోలిశెట్టితో బాటు దయ్యానికి సైతం భయపడని అసిరిగాడు, దయ్యాన్ని సీసాలో బంధించగల చతురుడు గవరయ్య, దయ్యానికే కాదు దేవుడికీ భయపడని బైరాగి ఇన్స్‌పెక్టరుకు భయపడి సాక్ష్యం ఇవ్వకుండ పలాయనం చిత్తగించడం చూసి హెడ్ కానిస్టేబుల్ కడుపు తరుక్కుపోతుంటేనూ చదివి నవ్వుకోగలం. కానీ ఇవ్వాళ కోర్టులనూ, పోలీసులనూ, 'రాజ్యం' సకల అంగాలనూ చూసి నవ్వుకోగల రోజులు పోయాయి. బండివాడి కోరిక ఇవ్వాళ పల్లెటూరి బైతు కోరిక కాదు, దేశ ప్రజల కోరిక అయింది.